# విడాకులు

కామాక్షమ్మ కోడలు కామిని చెవిటిదనే విషయం చాలా త్వరలోనే గ్రహించేరు ఆ వూళ్లోవాళ్ళు!—ముచ్చటగా కబుర్లు చెప్పుకుంటూ విమర్శించడానికి తగిన విషయం దొరికింది వాళ్ళకి. ఎవరినో ఒకర్ని విమర్శిస్తూఉండడం ఈ లోకుల లక్షణంకాబోలు మరి! చాలామంది విమర్శకులు బయల్దేరేరు!—"ఏదో తన పిల్లకి అనువుండబట్టే ఆ మూగాడికిచ్చేసేరు రామయ్యగారు. లేకపోతే చూస్తూ చూస్తూ మూగాడికిచ్చేస్తారా మరి?" అని తర్కిస్తూ విమర్శించేరు కొందరు—

"నా కూతుర్ని ఇవ్వమని మొదట అడిగింది కామాక్షమ్మ!...వాడిని కప్పెట్టేటంతటి డబ్బున్నా చూస్తూ చూస్తూ పండంటి నా కూతుర్ని ఆ మూగాడి కెలా యిచ్చేయడం?-పోనీ ఆ రామయ్యగాడి కూతురిలాగ అనువేమన్నా ఉందేవిటి నా కూతురికి వాడికిచ్చేయడానికి!" అని, తన కూతురికి ఏ అనువూ లేకపోయినందుకు మురిసిపోతూ గర్వంతో అందో యిల్లాలు—

"పాపం! తనకొడుక్కి ఓ చక్కనిచుక్కను కట్టబెట్టాలని మహా ఉబలాటపడింది ఆ ఇల్లాలు!-కానీ ఆఖరికి ఓ చెవిటిదాన్ని అంటగట్టింది! అంతకన్నా శుభ్రమైన పిల్లని ఎవరిచ్చేస్తారు మహా మూగాడికి!"- ఆమె చెవిటిదని

తెలియనప్పుడు 'అందమైన పిల్లే!' అన్న ఆ గొంతు ఆమె చెవిటిదని తెలియగానే ఆమె అందానికే మహాలోపం వచ్చిందనే ధోరణిలో మాట్లాడిందా గొంతు.

"చెవిటిదయిపోయిందిగానీ ఇదీ మరో మూగదే అయివుంటే మహాగమ్మత్తుగా వుండేదా దాంపత్యం!" అని నవ్వ మొదలెట్టారు కొందరు.

మొత్తానికి ఆ మూగీ, చెవిటీ వాళ్ళదాంపత్యం లోకానికి నవ్వుకోడానికీ - విమర్శించుకోడానికీ తగినంతవిష యం అయింది. వాళ్ళలా ఎందుకు విమర్శిస్తూ నవ్వుతూ వుంటారో వాళ్ళనే అడిగితే వాళ్లూ చెప్పలేరు - కానీ విమ ర్శించడంమాత్రం మానరు.

ఈ విమర్శలూ, వెటకారాలూ, నవ్వులాలూ కామా క్షమ్మ హృదయంలోకి సూటిగా ములుకుల్లాగా గుచ్చుకు పోయేయి. కన్నీటిస్రవంతికి అడ్డంగా పైటచెంగు పెట్టుకుంది. తనజీవితంలో ఇంకా ఎంతలోతు అగాధాలుఉన్నాయో ఆమె కర్థంకాలేదు - అప్పట్లో తన చిన్నిరామాన్నిచూసి భర్తగతించిన దుఃఖాన్ని విస్మరించిందామె. కానీ, తనకొడుకు ఓ మూగివాడవుతాడని అప్పట్లో ఆమె ఏకోశానా అనుకో లేదు! - మానవుడి కుండవలసే హంగుల్లో యేవొకటి లోపించినా తోటిమానవులు ఎంత నిరసనభావంతో చూస్తారో ఆమెకప్పు డర్థమైంది.

లోకులు రామాన్ని మూగివాడనే నిరసనభావంతో చూసినప్పటికీ ఆ మాతృస్త్రీ దృష్టిలోమాత్రం తనకొడుకు చాలా గొప్పవాడుగా కనిపించేవాడు! కొడుకంటే ఆమెకి

వెర్రిఅభిమానం!...బహుశా వాడు మూగివాడుకాకుండా వుంటే అంతభిమానం ఉండకపోయేదేమో! - చదవడం వ్రాయడం మాత్రం నేర్చుకున్నాడు రామం తల్లి కుదిర్చిన ప్రైవేటుమాష్టరు దగ్గర.

రామానికి ఇరవైయేళ్ళ వయస్సు వచ్చేక కురూపులైన పిల్లలుగలవాళ్ళు చాలామంది అడగొచ్చేరు పిల్లనిస్తామని!-అంగవైకల్యం కలిగి, ఛాతికలోపాలుగల పిల్లలను యిస్తామని చాలామంది గంతులేసేరు - కానీ ఆ సంబంధాలేవీ నచ్చేయికావు. మూగివాడయినా, చూడ కళ్ళుండీ, విన చెవులుండీ, సౌందర్యానికీ, వికృతస్వరూపానికీగల తేడానూ; మధురమైన మాటలతో ఏర్పడిన భాషకూ, అవ్యక్తమైన మూగభాషకూ గల తేడానూ గ్రహించగలిగే తన కొడుక్కి సౌందర్యవతీ, గుణవతీ, అవలక్షణాలు లేనిదీ అయిన పిల్లను వధువుగా తేవాలని కామాక్షమ్మ వాంఛ!...

—ఆఖరికి రామయ్యతో వియ్యానికి అంగీకరించింది. చక్కనిరూపంతో ఉన్న 'కామిని' చెవిటిదనే విషయం తెలిసేసరికి కామాక్షమ్మహృదయం బెంగతో కృశించిపోడం మొదలెట్టింది...వాడినీ ఓ యింటివాడిగాచేసి ఆ కాపురాన్ని చూసి ఆనందించాలని తహతహలాడింది!...

ఆమెకొడుకు మూగివాడైనప్పటికీ చెవిటివాడు మాత్రం కాడు! తనభావాలను భాషతో వ్యక్తం చెయ్యలేడుగాని, యితరులు మాట్లాడేమాటలను విని గ్రహించగల శక్తి వున్నది! పైగా రూపసి!...

వాడికి ఏ లోపమూలేని ఓ రూపసీ, గుణవంతు

రాలూ అయిన పిల్లని కట్టిపెట్టాలనే ఉద్దేశ్యం ఆ మాతృశ్రీకి కలగడంలో తప్పులేదేమో!...మంచి స్థితిపరురాలవడం చేతా, ఆ ఒక్క కొడుకే తనకాధారంఅవడంచేతా కాబోయే కోడలివిషయంలో ఎంపికలు జరిపింది. అయిపోయిన తరవాతగానీ గ్రహించలేకపోయింది కామాక్షమ్మ - చెముడూ అంటే సాధారణపు చెవుడు కాదు!...బ్రహ్మ చెవుడు!!... పుట్టుకతోనే వచ్చిందా చెవుడు. మామూల్గా మానవుల గొంతుకలేవీ వినిపించవు ఆమెకు! పెదవులుకదిపి ఏమేమో అంటూవుండే మానవుల అరుపులేవీ ఆమెకి వినిపించవు. మానవులు మాట్లాడతారనిమాత్రం ఆమెకి తెలుసు! ఎంచేతాఅంటే తనూ మాట్లాడుతుంది కాబట్టి. తను తన భావాల్ని ఇంకోళ్ళతో మాటల్లోనే చెబుతుంది. కాని ఇంకోళ్ళు తనకి చెప్పినప్పుడుమాత్రం సంజ్ఞలుచేసి చెప్తేగాని అర్థంకాదు. అంతా సౌంజ్ఞల బ్రతుకాయె! - రామం తన భావాలను వ్యక్తంచెయ్యవలసివచ్చినప్పుడు సంజ్ఞలు చేస్తాడు. ఒకరుచెప్పిన మాటలను వినగలడు తను!- ఒకవిషయం చెప్పవలసొచ్చినప్పుడు సౌంజ్ఞలుచేసి చెప్పాలి కామినికి. ఒకరుచెప్పే మాటలను వినగలిగేశక్తి లేదామెకి!- ఇదీ ఆ భార్యాభర్తలిరువురికీ మధ్యగల భేదం!—

—పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళినరోజునే, కామిని చెవిటిదనేవిషయం తెలిసిపోయింది కామాక్షమ్మకి - ఆమె హృదయం భరించలేని అవమానంతో కంపించిపోయింది. కామిని తలిదండ్రులను ఎంతగానో తిట్టుకుంది, అలా ఆమె లోపాన్ని చెప్పకుండా దాచివేసినందుకు. ఫలితంగా కామిని

మీద ఆమె కెక్కడలేని అసహ్యం, కోపం వచ్చిపడ్డాయి!- పాపం, కామిని ఏంచేసిందని దానిమీద అంత అసహ్యం కోపం ఆమెకు? ఆమె చెవిటిదవడం తప్పా?...

మాటాడలేని కొడుకూ - మాటాడితే వినిపించుకో లేని కోడలూ, ఆ యింటికి మున్ముందు యజమానులనే విష యం తెలుసుకునేసరికి ఆమెగుండెలు గతుక్కుమన్నాయి... ఆమె గుండెలను పీల్చి పిప్పిచేసే ఆవేశం బయల్దేరింది!... దానికితోడు లోకులు కారుకూతలు కూస్తున్నారు - విరగబడి నవ్వుతున్నారు - ఇష్టానుసారం విమర్శిస్తున్నారు! -తన సంసా రాన్ని చూసేసరికి వాళ్ళ కెందుకా విరగబాటో ఆమె కర్థం కాలేదు.

లోకులు ఆ రకంగా విరగబడకపోతే ఆమె ఆ రక మైన బాధపడక పోయేదేమో!..."చెవిటిది కాబట్టే ఇచ్చే సేరు. దీనికొడుక్కి లేకపోతే ఈ మూగాడికి యిచ్చేస్తా రేవిటి?" అని లోకులు అనేమాటలు ఆమెహృదయం లోకి బాగా గుచ్చుకున్నాయి. ఫలితంగా ఏడుపూ, బాధా, కోపం, ఈర్ష్య అనేవి జనించేయి ఆమెలో!—అవన్నీ పట్ట లేని కోపంగా మారి అమాయకురాలైన కామినిమీద దాడి చేసినయ్!!...

ఏంచేస్తుందా అమాయకురాలు కామిని! ... నోరు కదిపి ఏమేమో తిట్టే అత్తగారిగొంతు ఆమెకి వినిపించలేదు గాని, శరీరానికి స్పర్శజ్ఞానం ఉండడంచేత కొట్టినదెబ్బలకు మాత్రం కన్నీరు కార్చకుండా ఉండలేకపోయేది.

అందరిలాగా తనభావాలను మాటలరూపేణా పైకి

వ్యక్తపరచే శక్తి ఆమెభర్త రామానికి లేకపోయినా చూడ్డానికి కళ్ళూ, వినడానికి చెవులూ ఉండడంచేత అనవసరంగా తనభార్య పడుతున్న బాధని చూసి ఎంతేనా నొచ్చుకునేవాడు. తల్లియొక్క మూఢత్వాన్ని చూసి ఎంతయినా అసహ్యించుకొనేవాడు. తమకు పుట్టుకతోనే వచ్చిన ఆ లోపాలను చూసి లోకులుకూసే కారుకూతలకు ఎంతైనా బాధపడేవాడు!!

ఏదో అర్థంలేని మూగభాషలో తల్లికి నచ్చచెప్పేవాడు, కామినిని ఏమీ అనొద్దని! కానీ కొడుకు ఉద్దేశ్యాలని లక్ష్యపెట్టేదికాదు కామాక్షమ్మ. తనకోడలు ఓ చెవిటిది అవడం ఎంతో అవమానంగా తోచింది ఆమెకిమట్టుకు! లోకానికి బుద్ధివచ్చేలాగా తన కొడుక్కి ఏ లోపమూలేని మరో మంచిపిల్లను వివాహంచేసి, తన సామర్థ్యాన్ని లోకానికి తెలియబరుద్దామనే ఉద్దేశం కలిగిందామెకి. తనకొడుక్కి మంచిలక్షణమైన పిల్లనిచ్చేవాళ్ళు లోకంలో లేకపోలేరనీ లోకానికి విశదపరుద్దామని రామానికి రెండోవివాహంచేయ నిశ్చయించింది. మూగివాడైన తనకొడుకు సలహా అనవసరమనీ, అదీగాక తనమాట 'రామం' జవదాటడనే నిబ్బరం మీద కొడుక్కి చెప్పకుండానే మరో సంబంధంకోసం ప్రయత్నంచెయ్యడం మొదలెట్టింది కామాక్షమ్మ.

కానీ ఏ తప్పూ చేయని భార్య ఉంటూఉండగానే ఇంకొక పిల్లనెలా యివ్వడానికి సాహసిస్తారు? — అంచేత ఎలాగైనా కామినిమీద తప్పు కనిపించి దానికి విడాకులు

కొడుకుచేత ఇప్పించేటట్టు చేద్దామనే ప్రయత్నంలో పడింది కామాక్షమ్మ!—

కామాక్షమ్మ చాలా అసాధ్యురాలు!—తలచుకోవాలే గాని ఎంతసేపావని ఆమెకి — పొరిగింటి వెంకయ్యకొడుకు ద్వారా తనపని నెరవేర్చుకోదల్చుకుంది!!

ఇంకేం?! 'గుప్'మంది లోకం!!

"చెవిటిముండకు ఆ మూగాడు నచ్చేడుకాడు కాబోలు!—వెంకయ్యకొడుకుతో సరసాలకి దిగిందిట!" అని లోకం "చెవిటి"దానికి తోసను "ముండ" అని కూడా చేర్చుకొని యథేచ్ఛగా అనుకోడం మొదలెట్టేరు.

* * *

మూగివాడంటే అయేడే కానీ రామానికి హృదయం అంటూ ఓటుంది - న్యాయాన్యాయ విచక్షణ చేయగలిగే మానసికశక్తికూడా ఉంది! —కామినియొక్క హృదయాన్ని పూర్తిగా అర్థంచేసుకున్నది ఒకేఒకరు!—అతనే రామం! - కామిని శీలాన్ని అతనెన్నడూ శంకించబోడుకూడా. కాని లోకం కోడయి కూస్తున్నది. అనవసరంగా కామిని కొచ్చిన అపనిందను తలచుకొని కన్నీరుకార్చడం తప్ప వేరేమీ చేయలేకపోయేడు.

ఆ మూగహృదయంలో బయలుదేరిన తుఫాను లోకులకుగానీ, కనీసం అతని తల్లికిగాని తెలీదు! — అసలు మొదట్లో కామిని తనకు భార్య అవుతుందనగానే చాలా విచారించేవాడు. అంత చక్కనిచుక్క మాటాడశక్తిలేని తనకు భార్యగా ఉండి ఏం సుఖస్తుందని మొదట అను

కున్నాడు. కాని ఆమె చెవిటిదని తెలిసినతరువాత ఎంత గానో సంతోషించేడు. అదంతా తన అదృష్టమే అనుకున్నాడు. ఎంచేతంటే అందరిలాగే వినగలిగే శక్తిగలభార్యే అయితే తన యీ మూగభాషని విని అసహ్యించుకోదూ? తనలాంటి మూగవాడు భర్త అయినందుకు దుఃఖంతో కృంగి కృశించిపోదూ?—చెవిటిదయిపోయింది గనక సరిపోయింది!—ఒకవేళ మాట్లాడేశక్తిగలవాడు భర్త అయినా ఆమె వినిపించుకోలేదు!—ఈ రకమైన ఆదర్శదాంపత్యం లోకానికి నచ్చలేదు కాబోలు మరి!-

అసలు కామిని అంటే రామానికి ఎంతో ప్రేమ! ఆమె ఒక్క—క్షణం తనకంటికి దూరంఅయేసరికి ఎంతో బాధ పడేవాడు. ఉదయం లేచేసరికి ఆమే తనకి ముఖం కడుక్కోందికి నీళ్ళు యివ్వాలి. ఆమే తనకు కాఫీ తెచ్చి యిచ్చి, తన ప్రక్కనే ఆమెకూడా కూర్చొని ఆమెకూడా త్రాగాలి. రాత్రి నిద్రపట్టకపోయినప్పుడు తనకి చక్కని కథలు చెప్పాలి! అంతెందుకు? కామిని ఓకామినీదేవతలాగుండేది అతని దృష్టిలో!

— కామినిదృష్టిలో అతనూ అలాగే ఉండేవాడు!- రామంయొక్క మూగభాషనూ, హృదయాన్నీ చక్కగా అర్థంచేసుకున్నవ్యక్తి ఒక్క కామినే అని చెప్పాలి! - అతనొక్క సంజ్ఞచేసేసరికి చటుక్కున అతనిభావాన్ని గ్రహించేసేది. బహుశా ఆమెకుకూడా మూగభాష వచ్చునేమో అన్నట్టుగా అతని భావాలను చిటికెలో అర్థం చేసుకుంటుంది. తన భర్త మూగవాడయివుండడం తన అదృష్టమే

అనుకుంటుందామె! – ఒక వేళ మాట్లాడగల శక్తిగల భర్తే అయిఉంటే అతను మాట్లాడినప్పుడు తనకి వినిపించనప్పుడు, ఎంతగా తనను బాధిస్తాడో ఊహించలేకపోయిందామె!!

ఆ భార్యా భర్తలిద్దరూ ఎంత అన్యోన్యంగా ఉన్నప్పటికీ, ఆ తల్లికిగాని, లోకానికిగానీ నచ్చలేదా దాంపత్యం! "మూగి, చెవిటివాళ్ళ దాంపత్యం" అని చాలా తేలిగ్గా అన్నారు లోకం. ఆ కూతలు కామాక్షమ్మహృదయంలో ములుకుల్లాగా గ్రుచ్చుకున్నాయి!!

* * *

కన్నీరు కారుస్తూ మంచంమీద కూర్చున్నాడు రామం!

"మానవులకు తెలివితేటలుంటాయి. కానీ ఈ పాడు కళ్ళకు ఆ తెలివితేటలేవి! – ఊరికేనే తెగకారుతున్నాయి కన్నీళ్ళు. నా కళ్ళంట నీరు కారడం సబబు! – కానీ మీ కెందుకీ ఏడుపు? – చక్కా మరోపెళ్ళి చేసుకోమని మీ అమ్మగారు చెప్తున్నారుగా! – మీరు నా కెందుకు విడాకు లివ్వడానికి సంశయిస్తున్నారు? నేనో పాపిష్టిదాన్ననేగా! లోకం అంతా నామీద పగబట్టింది –" అని కామిని కన్నీరు కారుస్తూ ఏమేమో చెబుతూ ఉండగానే రామం ఆమెనోటికి అడ్డంగా చెయ్యిపెట్టి బావురుమని ఏడిచి ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడు.

"పావం మీ అమ్మగారుకూడా ఏడుస్తున్నారు. ఎందుకో తెలుసా? – మీరు నన్ను విడిచిపెట్టకుండా ఇంకా ఏలుకుంటున్నందుకు! – నాశీలం చెడిపోలేదని మీరనుకుం

టున్నారేమిటి? - లోకం అంతటా కోడైకూస్తున్నదే! నాకూ వెంకయ్యగారి కొడుక్కు సంబంధం గమ్మత్తుగా అంటగట్టేరే! - అసలు నేను వాడి వేపే ఎన్నడూ చూడకపోయినప్పటికీ, కామిని నన్ను ప్రేమించిందని ఆ దిక్కుమాలిన వెధవ బాహాటంగా ప్రచారం చేస్తున్నాడే! - ఆ ప్రచారం మీద నమ్మకం కలగలేదా మీకు? నేనేం తప్పుచేసేనండీ నామీద అందరూ యిలా విరుచుకు పడుతున్నారు?" అంటూ రామం ఒళ్ళో తలపెట్టి వెక్కి వెక్కి యేడిచింది కామిని!

ఆ రెండు హృదయాలూ ఒకదగ్గర హత్తుకుపోయి, కన్నీటిప్రవాహంలో తేలిపోయేయి!

రామం కాగితం కలం తీసేడు! -

"లోకులు అంటున్న మాటలు పూర్తిగా నీకు వినిపించలేదుగానీ, నా యీ పాడు చెవులతో అన్నీ వింటున్నాను. నాకే నోరుఉంటె వాళ్ళనోళ్ళు అన్నీ ఈపాటికి కట్టించేసి ఉందును. హృదయాలను దగ్ధపరచి వేరుచేసే ప్రయత్నం మా అమ్మదే అని నాకు తెలుసు! - చాలా వరకూ ఆమెకు నచ్చజెప్పబోయేను. నేను నచ్చజెప్పబోయేసరికి ఆమె యేడుపు మొదలెడుతోంది. ఇవతల భార్య అవతల తల్లి! - ఎవరియేడుపు వింటూ ఊరుకోమంటావు? ఇప్పుడు నే పడుతున్న బాధ నీ కర్థంకాదు. ఇది మరణయాతనను మించిన బాధ - నే నిప్పుడు చస్తున్నాను కామినీ, ఎంతో ఆనందంగా గడపిన మనజీవితాలు కొసవరకూ యింక ఏడుపుతోటేగాని గడువవు గదా! - మనం ఆనందంగా

ఉండడం ఈ లోకానికి ఇష్టంలేదు కాబోలు మరి - ఆఖరికి మా అమ్మకుకూడా యిష్టంలేదు - నిన్ను విడిచేసి మరొ కర్ని వివాహం చేసుకోమని మా అమ్మ నాకు రోజూ బోధ పరుస్తున్నది. నీకూ వెంకయ్యకొడుక్కూ సంబంధం వుందని రోజూ చెప్తున్నది నాతో. కావలిస్తే వెంకయ్యకొడుకుచేత చెప్పిస్తానంది. ఆ కపటనాటకం అంతా నాకు తెలుసు - 'నాకే ఋజువులూ, సాక్ష్యాలూ అక్కర్లేదు. మా కాపురం యిలా ఉండనీయమ్మా - ఒకవేళ కామినిని విడిచిపెట్టే సినా మరొకరిని వివాహం చేసుకుంటాననుకుంటున్నావేమి టమ్మా? - అది మాత్రం కల్ల." అని మా అమ్మకు ఖచ్చిత మైన నా అభిప్రాయాన్ని తెలియజేసేను. దాంతో మా అమ్మకు నామీద కోపంవచ్చింది. నాతో రెండురోజులై మాట్లాడ్డంలేదు. మా అమ్మ పిచ్చిగానీ, ఎందుకలా అనవ సరంగా బాధపడడం? లోకులేదో పేలుతున్నారని యింత ఘోరానికి ఒడిగట్టం మంచిపనేనా? ఎంతతల్లి అయినప్పటికీ ఈవిషయంలో ఆమెమాట వినను! కామినీ!...నాహృదయ కుసుమమైన నిన్ను విడిచిపెట్టేస్తానని బెంగపడుతున్నావు కదూ? అలామాత్రం బెంగపెట్టుకోకు. నాలో ప్రాణం ఉన్నంతవరకూ నిన్ను విడిచిపెట్టను! సరేగాని యివాళమందు త్రాగలేదూ?! ... పాడుముండజబ్బు నిన్నావేశించిం దేవిటి?..." అని రాతఆపి, ఆకాగితం కామిని చేతికిచ్చి అలమార తెరిచేడు మందుసీసాకోసం.

*　　　*　　　*

ఆరోజున కామినికి జబ్బు హెచ్చయింది!- మాటి

మాటికీ తెలివి తప్పిపోడం మొదలుపెట్టింది. ఏవేవో అస్పష్టమైన పరాకుమాటలు ఆడడం మొదలుపెట్టింది!–రామంహృదయం భయంతో దడదడ కొట్టుకోడం మొదలెట్టింది–డాక్టరుకాళ్ళు పట్టుకున్నాడు.

కామాక్షమ్మకూడా ఆమె జబ్బుగురించి తగుశ్రద్ధ తీసుకుంటున్నట్టు నటించింది! కాని ఆమెతలపెట్టిన ఘోరం గురించి యేఒక్కరికీ తెలీదు. డాక్టరికిమాత్రం తెలుసు! ఏతప్పుచేయని కామినివిషయంలో అంతఘోరం చేయడం న్యాయమైనపనేనా అని ఆమెకు ఓరకమైన భీతి, ఆందోళనలు కలుగకపోలేదు!!–కానీ, "కారుణ్యం వహించకు. పశ్చాత్తాపాన్ని పొందుతావు. జీవితాంతంవరకూ దుఃఖాన్నే అనుభవిస్తావు. నువ్వు చెయ్యదల్చుకున్నపనేదో త్వరగా చెయ్యి, గతించినది మరచిపో!...నిన్నెవరో అన్యాయం చేసేరని తలచుకొని, ఈపనిచెయ్!" అని ఆమె మనస్సు హెచ్చరించింది. ఆమెకూ ఆత్మఅంటూ వోటుంది. ఆమె ఆత్మపై ఆమెకేమాత్రం అధికారంలేదు–"నువ్వేయీఘోరం చేసినట్లయితే, నీజీవితాంతంవరకూ, నీహృదయానికి దుఃఖాన్ని కవచంగా తొడుగుతాను, బాధపడతావు!!" అని ఆత్మ హెచ్చరించింది.

కాని ఆమె మానసికబలంముందు ఆత్మబలం పరాభవింపబడింది. ఫలితంగా కామాక్షమ్మ చెప్పినట్లు డాక్టర్ కామినికి 'స్లోపాయిజన్' ఇచ్చేసేడు.

ఈవిషయాన్ని అమాయకులైన రామంగానీ, కామినిగాని కనుక్కోలేకపోయారు.

ఆలిగ్రాములు అందుకున్న తరువాత కామిని తల్లి దండ్రులూ వాళ్ళూ వచ్చారు.

ఆఖరిరోజున కామిని రామంతో అంది. "మీ అమ్మగారు ఎంత చెప్పినా విడాకులిచ్చారు కాదు నాకు!...కానీ ఈనాడు నేనే మీకు విడాకులిచ్చి వెళ్ళి...పో...తు...న్నాను" అని కళ్ళుమూసుకుంది కామిని.

అంతా ఒక్కమారు గొల్లుమన్నారు!...కామాక్షమ్మకూడా యేడ్చింది, కాని కామిని చనిపోయిందనే విచారంతో కాదు; కామినిగురించి కొడుకంతలా యేడుస్తున్నందుకు.

*  *  *

క్రొత్తపెళ్ళికూతురి పేరు 'లవంగి'. తల్లి పోరుపడలేక రామం వివాహం చేసుకున్నాడేగాని ఆమెతో సుఖించాలనే కోరిక అతనికి రవ్వంతైనా లేదు. లవంగికి ఎప్పుడూ కనుమరుగుగా ఉండడం అలవాటు చేసుకున్నాడు. కొత్తభార్యని చూడ్డానికే అసహ్యించుకునేవాడు.

ఏలోపమూ లేని చక్కనిచుక్క అయిన లవంగిఅంటే అభిమానం కామాక్షమ్మకు. ఆమెకు అభిమానం ఉంటే మాత్రం ఏంలాభం? ... కొడుకుయొక్క ప్రవర్తనచూసి యెంతైనా అసహ్యించుకొనేది-"చూడు నాయనా! చచ్చిన దానికోసం అలా విచారిస్తే ఏం లాభం?...అందులోకీ ఆపోకిరీ ముండకోసమా ఆ విచారం!...మంచిలక్షణమైన పిల్లరా లవంగి." అని యెన్నోసార్లు చెప్పింది కొడుక్కి.

కానీ యేం లాభం?...తన హృదయం తన అధీ

నంలో వుంటేగా లవంగిని ప్రేమించడానికి? అది ఏనాడో కామిని దొంగిలించేసింది...అలా ఆ నక్షత్రాలవంక చూస్తూ కన్నీరు కార్చడం ఓరకమైన అలవాటైంది రామానికి-

లవంగి డబ్బునిచూసి రామాన్ని పెళ్ళాడ్డానికి అంగీకరించిందేగాని వేరుకాదు-కామినివిషయంలో అబద్ధమైనా, లవంగివిషయంలో చెప్పవలసొచ్చినప్పుడు పొరిగింటి వెంకయ్య కొడుకుతో నిజంగా సంబంధముంది లవంగికి.

ఇప్పుడూ లోకులు విమర్శిస్తున్నారు.

కామినివిషయంలో కపటనాటకం ఆడించిన కామాక్షమ్మ హృదయం, అది తన అభిమానురాలయిన లవంగి విషయంలో నిజమైనప్పు డెలాగుంటుందో...

లోకులు భరింపశక్యంగాని కూతలు కూయడం మొదలెట్టేరు -"మొదటి కోడల్ని మించిపోయిందీ రెండో కోడలు-ఇంతక్కి ఈమూగాడిని చూసి పెళ్ళాడుతున్నా రేవిటి? డబ్బుని చూసిగాని."...అని ఘాటుగా విమర్శించడం మొదలెట్టారు.

ఈమారు రామమే లవంగికి విడాకు లివ్వడానికి సిద్ధపడ్డాడు.—

ఆ మాతృశ్రీహృదయం చెక్కలైంది.

---